చిమ్మ చీకట్లో కాలనీలు

- అయిజలో వీధిలైట్లకు కేటాయించని బడ్జెట్
- కొనుగోలు చేయని ఎల్ఈడీ బల్బులు
- శాఖల మధ్య అవగాహన లోపం

అయిజ: పట్టణంలోని దాదాపు వంద కాలనీల్లో వీధిలైట్ల సమస్యతో రాత్రుళ్లు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. రాత్రి వేళల్లో బయటకు రావాలంటేనే భయపడాల్సిన దుస్థితి ఏర్పడిందంటున్నారు. విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసే థర్డ్ వైర్, ఫిఫ్త్ వైర్లు లేకపోవడంతో ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేయలేకపోతున్నామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఎన్ని విద్యుత్ స్తంభాలకు థర్డ్ వైర్, ఫిఫ్త్ వైర్ అవసరమో మున్సిపల్ అధికారులు తెలియజేయాలని విద్యుత్ అధికారులు అంటున్నారు. రెండు శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో మున్సిపాలిటీలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.


అయిజ మున్సిపాలిటీలో చీకటిగా ఉన్న కొత్తబస్టాండ్ ప్రాంతం(ఫైల్)


తెలుగుపేటలో వెలగని వీధిలైట్లు

స్తంభాల లెక్కతెలియని దుస్థితి

మున్సిపాలిటీ కనీసం ఎన్ని విద్యుత్ స్తంభాలు ఉన్నాయనే విషయంలో ఇటు మున్సిపల్ అధికారులకు, అటు విద్యుత్ అధికారులకు అవగాహన లేకుండా పోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో ప్రధాన రోడ్లు, వివిధ కాలనీల్లో ఉన్న విద్యుత్ స్తంభాలకు దీపాలు వెలగడం లేదు.

ఏడేళ్లుగా కొనసాగుతున్న సమస్య

అయిజ పట్టణం నగరపంచాయతీగా ఉన్నప్పుడు ఏర్పడిన థర్డ్ లైన్, ఫిఫ్త్‌లైన్ సమస్య మున్సిపాలిటీగా రూపాంతరం చెంది 7 సంవత్సరాలైనా కొనసాగుతోంది. ముఖ్యంగా అంబా భవానీ ఆలయం నుంచి కొత్త బస్టాండ్‌లోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో చిమ్మ చీకటి అలుముకుంది. అదే విధంగా టీచర్స్ కాలనీ, నరసింహ కాలనీ, గాజులపేట తదితర కాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రయితే చాలు చిమ్మచీకట్లో ప్రయాణించాలంటేనే భయపడాల్సి వస్తోందని ఆయా కాలనీల వాసులు వాపోతున్నారు. వీధికుక్కలు, విషపూరిత ప్రాణుల బారిన పడకుండా అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రయాణించడం కష్టంగా ఉంది..



పట్టణంలోని ప్రధాన వీధుల్లో చాలా చోట్ల వీధి బల్బులు ఏర్పాటు చేయలేదు. ముఖ్యంగా అంతర్గత రోడ్లపై ప్రయాణించాలంటే కష్టంగా ఉంది. దీనికి తోడు రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వాహనాలపై వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తోంది. వెంటనే వీధి బల్బులు ఏర్పాటు చేయాలి.

-మహేష్, అయిజ

ఏళ్లతరబడి ఇదే సమస్య



పట్టణంలోని కొన్ని విద్యుత్ స్తంభాలకు థర్డ్ వైర్, మరికొన్ని స్తంభాలకు ఫిఫ్త్ వైర్ ఏర్పాటు చేయకపోవడంతో ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేయడం లేదని అధికారులు చెబుతున్నారు. పట్టణంలో ఏళ్ల తరబడి ఇదే సమస్య ఉంది. అధికారులు సమస్యను తక్షణమే పరిష్కరించాలి.

-నజీర్, అయిజ

బడ్జెట్ కేటాయిస్తాం



మున్సిపాలిటీలోని 20 వార్డుల్లోని అన్ని కాలనీలకు ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేసేందుకు త్వరలో బడ్జెట్ కేటాయిస్తాం. వైరింగ్ సమస్య తదితర సమస్యలు ఉన్నాయి. వీలైనంత త్వరగా విద్యుత్ స్తంభాలకు ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం.

- సీహెచ్ సైదులు, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

డీసీఎం వ్యాన్‌ను ఢీకొన్న కారు

మానవపాడు: జాతీయ రహదారిపై ఆగి ఉన్న డీసీఎం వ్యాన్‌ను కారు ఢీకొట్టిన ఘటన ఆదివారం మండలంలోని జల్లాపురం శివారు ప్రాంతంలో జరిగింది. స్థానికులు, పెట్రోలింగ్ సిబ్బంది కథనం మేరకు... హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న కారు జాతీయ రహదారి-44పై జల్లాపురం శివారు ప్రాంతంలో ఆగి ఉన్న డీసీఎం వ్యాన్‌ను ఢీకొట్టినట్లు తెలిపారు. ప్రమాదంలో కారు డ్రైవర్ అమీర్, జావేద్ హుస్సేన్, ముంతాజ్, ఇనాహమ్‌లకు గాయాలైనట్లు పేర్కొన్నారు. గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మిత్రుడికి ఆర్థిక సాయం



అయిజ: మండల కేంద్రంలోని నీలకంఠేశ్వర కాలనీకి చెందిన ఉరుకుందయ్యకు వైద్య చికిత్సకు అతని పదో తరగతి మిత్రులు ఆదివారం రూ.17,500 ఆర్థిక సాయం చేశారు. భవిష్యత్‌లో అండగా ఉంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్ రెడ్డి, విజయ్, కిరణ్, తిరుమలేష్, ధనుంజయ, నిరంజన్, పాషా, కృష్ణవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్ ఆలయాల్లో పూజలు



అలంపూర్: అలంపూర్ క్షేత్ర ఆలయాలను ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి ఘనస్వాగతం పలికారు. జోగుళాంబ అమ్మవారు, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయరా?



అలంపూర్ రూరల్: మండల పరిధిలోని అలంపూర్ నుంచి బుక్కాపూర్ వెళ్లే రహదారి గుంతలమయంగా మారి ప్రమాదాల బారిన పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

జడ్చర్ల టౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి పురస్కరించుకుని ఆదివారం వాసవీకమాన్ వద్ద ఆర్యవైశ్యసంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోరాటపటిమను ఆయన ద్వారా స్ఫూర్తిపొందాలని వక్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దాచేపల్లి చంద్రయ్య, కొత్త మధు, మేడిశెట్టి రామకృష్ణ, మురళికృష్ణ, అమరవాదిప్రభు, జ్యోతి, లక్ష్మి, శివరేఖ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు



అలంపూర్ రూరల్: మద్యం తాగి వాహనం నడిపిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకటస్వామి అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం వాహన తనిఖీల్లో భాగంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. నలుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ ఎస్ఐ తరుణ్ సబిరెడ్డి, పోలీసు సిబ్బంది ఆంజనేయులు, సురేష్ నాయక్, రహీం తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి


మునుగాలలో సీసీరోడ్డు భూమిపూజలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్


నాగర్‌దొడ్డిలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న మండల నాయకులు

అలంపూర్ రూరల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. అలంపూర్ మండల పరిధిలోని ఊట్కూర్ ఎస్సీ కాలనీలో రూ.5 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. పట్టణాలతో పాటు గ్రామాలు కూడ సమాన అభివృద్ధి చెందడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, టెలికం బోర్డు సభ్యులు ఇస్మాయిల్, ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్ రెడ్డి, నర్సన్‌గౌడ్, నర్సింహ, శేఖర్, రాము, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని మారమునగాల-2 గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ భూమి పూజలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ పాల్గొన్నారు. రూ.10 లక్షల నిధులతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నరేందర్, వెంకటేష్ గౌడ్, రమణ, రమేష్, రామాచారి, తదితరులు పాల్గొన్నారు. జ

ఎర్రవల్లి: మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో రూ.10లక్షల వ్యయంతో చేపడుతున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. గ్రామాల్లో ప్రధాన సమస్యలు గుర్తించి వాటిని సత్వరమే పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇటిక్యాల: పల్లెలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మునగాల గ్రామంలో రూ.30లక్షల నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం వేముల గ్రామానికి చెందిన యువకులు జాతీయ రహదారిపై వేములస్టేజీలో గద్వాల, వనపర్తి డిపోలకు చెందిన బస్సులను ఆపాలని కోరుతూ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు రుక్మానందారెడ్డి, వెంకటేష్ యాదవ్, నాయకులు లక్ష్మినారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, అల్లబకాష్, రాజ్‌కుమార్, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలోని నాగర్‌దొడ్డి, కుర్తిరావల్ చెర్వు, బూడిదపాడు గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా మంజూరైన సీసీరోడ్డు నిర్మాణ పనులకు మండల నాయకులు నాగర్‌దొడ్డి విక్రంసింహ రెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, పెద్దగోపాల్‌రెడ్డి లు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

భవన నిర్మాణం పూర్తయ్యేనా ?



ఉండవెల్లి: మండలంలోని ప్రాగటూరులో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం ఏడాదిగా పిల్లర్ల దశలో నిలిచిపోయింది. ప్రస్తుతం కార్యకలాపాలు సాగిస్తున్న భవనం శిథిలావస్థకు చేరడంతో అద్దె భవనంలోనే కాలక్షేపం చేస్తున్నారు. అద్దె భవనంలో గ్రామ సభలకు, తదితర వాటికి సరిపోక ఇబ్బందులు పడుతున్నట్లు అటు అధికారులు, ప్రజలు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుపేద ముస్లింలకు సాయం



శాంతినగర్: రంజాన్ పండుగను పురస్కరించుకొని నిరుపేద ముస్లిం కుటుంబాలకు శాంతినగర్ సేవా సమితి వడ్డేపల్లి సభ్యులు రంజాన్ తోఫా అందజేశారు. వడ్డేపల్లి పుర పరిధిలోని పైపాడు 1, 2 వార్డుల్లోని నిరుపేద 20 ముస్లిం కుటుంబాలకు దాతల సహకారంతో నిత్యావసరాలు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు షేక్ అస్లాం షరీఫ్, మాలిక్, దాసువరం నాగరాజు, రిహాన్ పాల్గొన్నారు.

శబరిమల నుంచి మొదటి ఇటుక



కొత్తకోట రూరల్: కొత్తకోట పట్టణ శివారులో సర్వాంగ సుందరంగా నిర్మిస్తున్న అయ్యప్ప గర్భాలయ నిర్మాణానికి మొదటి ఇటుకను శబరిమల దేవస్థానం తరపున ఆలయ ప్రధాన తంత్రి కందరరు రాజీవరు, ప్రధాన అర్చకులు అరుణ్ కుమార్ నంబూద్రిలు పంబా నదీ జలాలతో శుద్ధిచేసి ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప సేవాసమితి అధ్యక్షుడు ధూపం నాగరాజుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాగాకు రాఘవేంద్ర ప్రసాద్, విశ్వమోహన్‌చారి, ప్రముక మేకప్‌మెన్ వేణు, గుడిబండ నాగిరెడ్డి, గన్నోజి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'పల్లె ప్రకృతి వనం' ఎండుతోంది


వడ్డెవాట గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో ఎండిపోతున్న మొక్కలు

కొత్తకోట రూరల్: గత ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం గ్రామాల్లో హరితహారం కార్యక్రమంలో భాగంగా పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. సర్పంచ్‌ల పదవీకాలం ఉన్నప్పటికీ వరకు పల్లెప్రకృతి వనాల నిర్వహణ బాగుండేది. ప్రస్తుతం 'పల్లెప్రకృతి వనం 'లో మొక్కల నిర్వహణ గాలికి వదిలేశారు. పల్లె ప్రకృతి వనంలో మామిడి, ఉసిరి, సీతాఫలం, దానిమ్మ, వేపా తదితర మొక్కలు నాటారు. ప్రకృతి వనాన్ని అందంగా తీర్చిదిద్దుతామని ప్రారంభంలో అధికారులు చెప్పినప్పటికీ ప్రస్తుతం నిర్వహణ లేకపోవడంతో ప్రకృతి వనంలో మొక్కలన్ని ఎండిపోతున్నాయి. కొన్ని గ్రామాల్లో బోర్లు పనిచేస్తున్నప్పటికీ నీళ్ల పట్టడం లేదు. మరికొన్ని గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాల నిర్వహణ మొత్తం గాలికి వదిలేశారు. మండలంలోని వడ్డెవాటలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనంలో మొక్కలు ఎండిపోతున్నాయి. కొంత కాలంగా అధికారులు పట్టించుకోకపోవడంతో గేటు సైతం విరిగిపోయింది. దీంతో పశువులు, మేకలు, గొర్రెలు అందులోకి వెళ్తున్నాయి. దీంతో మొక్కలు విరిగిపోయేందుకు అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి గేటు సరిచేయడంతో పాటు మొక్కలు ఎండిపోకుండా నీళ్ల పట్టే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వర్గీకరణ అనంతరం నియామకాలు చేపట్టాలి


దీక్షలో ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఆత్మకూర్: రాష్ట్రంలో ఏబీసీడీ వర్గీకరణ పూర్తయిన తర్వాతనే గ్రూప్ -1, గ్రూప్- 2, గ్రూప్- 3 నియామకాలు చేపట్టాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గాంధీచౌక్‌లో మండల అధ్యక్షుడు దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు ఐదోరోజు కొనసాగింది. కార్యక్రమంలో అజ్జపాగ లక్ష్మణ్, సోంబాబు, జానకీరాం, జహంగీర్, రామకృష్ణ, మాసన్న, కృష్ణకుమార్, గాలిపంపు శ్రీను, కిషోర్, రాము, అనిల్, వెంకటన్న, కురుమూర్తి తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలి


గంగిమాన్‌దొడ్డిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న రాజు

గట్టు: ఉపాధి హామీ కూలీలకు చెల్లించాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. ఆదివారం గంగిమాన్‌దొడ్డి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పర్యటించి గ్రామ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ఉపాధి బిల్లులు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. బిల్లుల బకాయిల కారణంగా చాలా మంది ఉపాధి పనుల పట్ల ఆసక్తి చూపడం లేదన్నారు. ఉపాధి అధికారులు గ్రామంలోని బకాయిలను తక్షణమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రెప్ప, నాయకులు రామాంజనేయులు, పరుశరాముడు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలి


సమావేశంలో వివిధ పార్టీల నాయకులు

రాజోళి: మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు కలిసి కట్టుగా ముందుకు సాగాలని కాలేజీ సాధన సమితి కన్వీనర్ గాజుల ఈశ్వరయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని భ్రమరాంబ అడివేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో పలు రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. కాలేజీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. కాలేజీ కోసం స్థల విషయంలో తహసీల్దార్‌ను కలవాలని, త్వరలోనే సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లేందుకు ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయరా?


మల్దకల్- కుర్తిరావులచెర్వు మధ్య ప్రమాదకర మలుపు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలకు ఏర్పాటు చేసిన బీటీ రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. మలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్దకల్ నుంచి మద్దెలబండ, అమరవాయి నుంచి బిజ్వారం, పెద్దొడ్డి నుంచి మల్దకల్, కుర్తిరావులచెర్వు నుంచి మల్దకల్ గ్రామాల మధ్య ఉన్న రోడ్లపై మలుపులు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

తైక్వాండోతో విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్


విద్యార్థులతో మాస్టర్ శ్రీహరి

ధరూరు: తైక్వాండోను నైపుణ్యంగా ప్రదర్శిస్తే విద్యా, ఉద్యోగ పరంగా మంచి భవిష్యత్ ఉంటుందని తైక్వాండో బోర్డు రాష్ట్ర జనరల్ సెక్రటరీ, ఇంటర్నేషనల్ రిఫరీ మాస్టర్ శ్రీహరి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ధరూరు మండల మాస్టర్ రషీద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బెల్టు ప్రదానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్ గాయిత్రి, వినోద, దర్శం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించి అభివృద్ధికి తోడ్పడండి


పన్ను వసూలులో మున్సిపల్ కమిషనర్ సైదులు

అయిజ: ప్రజలు పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు కోరారు. ఆదివారం మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో సిబ్బందితో కలిసి రూ.1.46 లక్షలు ఆస్తిపన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. మొత్తం 8051 అసిస్మెంట్‌లు ఉన్నాయని, రూ. 1.69 కోట్లు పన్ను వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ. 1.19 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఓ లక్ష్మన్న, ఆర్ఐ విజయ్, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు ఓపెన్ యూనివర్సిటీ ఒక వరం


ఆత్మీయ సమ్మేళనంలో అధ్యాపకులతో విద్యార్థులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉన్నత విద్య చదవడానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఒక వరమని అధ్యాపకులు రాములు, నరసింహాచారి, మాలిక్‌పాషా, ఎల్లప్ప, కిరణ్మయి, కృష్ణవేణి అన్నారు. ఆదివారం క్రిస్టియన్‌పల్లిలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఎంవీఎస్ కాలేజీ స్టడీ సెంటర్‌లో పొలిటికల్ సైన్స్ సెకండియర్ విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనివార్య కారణాలతో ఉన్నత విద్యను అభ్యసించలేక మధ్యలోనే ఆపేసిన విద్యార్థులకు ఓపెన్ యూనివర్సిటీ ద్వారా పూర్తి చేసే అవకాశం ఉంటుందన్నారు. అలాంటి వారు ఎందరో ఇక్కడ విద్యనభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.పద్మావతి, స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ ఇక్కడే పీజీ పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు కొందరు ప్రస్తుతం విద్యార్థులకు బోధించడం అభినందనీయమన్నారు. స్టడీ సెంటర్ సిబ్బంది రఘువర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులు, విద్యార్థులు బూర్గుపల్లి కృష్ణయాదవ్, శంకర్‌గౌడ్, రాఘవేందర్‌రెడ్డి, రాధిక, మాధవి, అమృత, సుధ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అగ్నిగుండ మహోత్సవం


క్రీడాకారులతో నిర్వాహకుల కరచాలనం

నవాబుపేట: మండలంలోని పల్లెగడ్డ సమీపంలో వేలసిన స్వయంభూ ఆదిబసవేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగుండ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. నందికోలసేవ నిర్వహించిన శివభక్తులు అగ్నిలో నడుస్తూ భక్తిని చాటుకున్నారు. అనంతరం స్వామివారి ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. సోమవారం శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం

జాతరలో భాగంగా బసవేశ్వర దేవాలయం ఆవరణలో పల్లెగడ్డ యూత్ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా 27జట్లు పాల్గొనగా ఈటోర్నీ రెండు రోజులు జరగనుంది. విజేతలకు మాజీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రతాప్, సత్యం, రాములు, నేషనల్ రెఫరీ మల్లేష్, స్టేట్ కోచ్ ముస్తఫా, శ్రీనివాస్, బాల్‌రాజ్, శివ, గోపాల్ పాల్గొన్నారు.